ప్రజాశక్తి

ఆదివారం 22 జూన్ 2025 | 5 | అనంతపురం





పిటిసి మైదానంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

స్థానిక సంస్థలపైనా విద్యుత్ బాదుడు.!



స్థానిక సంస్థలపైనా విద్యుత్ ఛార్జీల బాదుడు సామాన్యంగా ఉండటం లేదు. ప్రజావసరాల కోసం వినియోగించే తాగునీటి విద్యుత్ కనెక్షన్లపైనా ఛార్జీల మోత మోగుతూనే ఉండటం గమనార్హం. దీనికి సంబంధించి వివరాలను ప్రజాశక్తి ప్రత్యేకంగా పరిశీలించింది. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగానున్నాయి.

- 'అనంత' నగరపాలిక విద్యుత్ వినియోగం బిల్లు రూ.46.88 లక్షలు
- బాదుడు రూ.18.25 లక్షలు
- అదనంగా మరో రూ.71.74 లక్షలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరానికి తాగునీటిని అందించే వ్యవస్థ ప్రత్యేకంగా ఉంది. ఇందులో ప్రధానమైనది పిఎబిఆర్ డ్యామ్ నుంచి నీటిని పంపు చేసి ముద్దలాపురం వద్ద శుభ్రం చేస్తారు. ప్రధానంగా నీటిని పంపింగ్ చేసే పిఎబిఆర్ వద్ద వాడే విద్యుత్ మోటర్లకు సంబంధించి కరెంటు బిల్లు ఏప్రిల్ నెలకు సంబంధించి చూస్తే వినియోగం ద్వారా అయిన బిల్లు రూ.46.88 లక్షలు ఉంది. లేటు ఫీజు కింద రూ.6.40 లక్షలు, ఇడి వడ్డీ రూ.4566, ఎసిడి సర్‌ఛార్జీ రూ.1.09 లక్షలు, ట్రూఅప్ ఛార్జీ రూ.1.95 లక్షలు, ఎఫ్‌పిసిసిఎ ఫిబ్రవరి 2025కు సంబంధించి రూ.1.96 లక్షలు, జూన్ 2022 రూ.3.21 లక్షలు, ఆగస్టు 2022 రూ.99324, మే 2023కు సంబంధించి రూ.2.56 లక్షలు కలిపి మొత్తం అదనపు ఛార్జీలు రూ.18.25 లక్షలు భారం పడనుంది. ఇది చాలదన్నట్టు విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగిందన్న పేరుతో ఎసిడి (అడ్వాన్సుడు కంజమన్షన్ డిమాండ్) ఛార్జీ రూ.71.74 లక్షలు కట్టాలని నోటీసు ఇచ్చింది. ఈ అడ్వాన్స్ కంజమన్షన్ డిమాండ్ అన్నది విద్యుత్ వినియోగం సాధారణం కంటే ఎక్కువగా ఉందని చెప్పి అదనపు డిపాజిట్ రూపంలో వసూలు చేసేది. ఈ రకంగా నగర పాలక సంస్థలోని ఒక్క విద్యుత్ మోటర్లపైనే రూ.89.99 లక్షలు అదనపు భారాన్ని ఏప్రిల్ మాసంలో ప్రభుత్వం విధించడం గమనార్హం. ఈ రకంగా అనంతపురం జిల్లాలో గ్రామీణ తాగునీటి సంస్థ పరిధిలోనే 26 సిడబ్ల్యుఎస్ పథకాలున్నాయి. ఇవి కాకుండా ఆయా పురపాలక సంఘాల పరిధిలోనూ ప్రత్యేకంగా తాగునీటి వ్యవస్థ ఉంది. వీటిపైనా ఇదే రకంగా పన్నుల భారం పడటం గమనార్హం.



అన్ని స్థానిక సంస్థలపైనా ఇదే తీరు

సామాన్య ప్రజలపై మోపుతున్నట్టే స్థానిక సంస్థలపైనా విద్యుత్ బాదుడు ఆగటం లేదు. ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల మోతలు మోగిస్తోంది. అధికారంలోకి సవ్వానే విద్యుత్ భారాలను తగ్గిస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు మాత్రం వాటిని ఏ మాత్రం తగ్గించకపోగా వైసిపి ప్రభుత్వ హయాంలోని ఎఫ్‌పిసిసిఎ భారాలను కూడా వసూలు చేస్తుండటం గమనార్హం. అసలే స్థానిక సంస్థల వద్ద నిధులు అంతంత మాత్రంగానే ఉంటున్న తరుణంలో ఈ భారాలు తడిసి మోపెడుతున్నాయి. స్థానిక సంస్థలు కాబట్టి అధికారులు, పాలకవర్గాలేవి నోరు విప్పలేని పరిస్థితులున్నాయి.

జీవన విధానంలా యోగా

- ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా చేయాలి
- యోగాంధ్ర ముగింపు కార్యక్రమంలో కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్




యోగసనాలు వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరికి యోగా జీవన విధానంలా మారాలని పలువురు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర ముగింపు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజల చేత యోగాసనలు వేయించారు. అనంతపురం నగరంలోని పిటిసి గ్రౌండ్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అధికారులు, విద్యార్థులు, వివిధ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, వివిధ రంగాల నుంచి 5,037 మంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,040 ప్రాంతాల్లో దాదాపు 10.87 లక్షల మంది యోగాసనాలు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో జిల్లాలో యోగంధ్ర కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. క్రమం తప్పకుండా ప్రజలు ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయన్నారు. అనంతరం యోగాంధ్ర కాంపిటీషన్స్ 2025లో అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెల్చుకున్న వారి కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ, జడ్పీ ఛైర్పర్సన్, జాయింట్ కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ మేయర్ ఎం.స్వరూప, డిఆర్ఓ ఎ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు బదిలీల షాక్.!

- రెగ్యులర్ ఉపాధ్యాయుల చేరికతో తప్పని స్థానచలనం
- దూర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చేలా నిర్ణయాలు
- 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల్లో టెన్షన్



ప్రజాశక్తి అనంతపురం సిటీ

ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి 1998, 2008 డీఎస్సీలో ఎంపిక అయ్యిన వారు అప్పట్లో నెలకొన్న సమస్యలతో అనాటి ప్రభుత్వాలు వీరికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వీరందరికీ ఉపాధ్యాయులుగా నియామకాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. 2008 డీఎస్సీలో ఎన్నికైన వారికి 2021లో, 1998 డీఎస్సీ వారికి 2023లో కాంట్రాక్ట్ బేసిస్ కింద ఎంటిఎ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1998లో 500 మంది, 2008లో 200 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరందరినీ మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) కింద నియామకాలు చేపట్టారు. ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రపు వేతనం తప్పా వీరికి డిఎలు హెచ్‌ఆర్‌ఎలు వర్తింపచేయలేదు. వీరి ఎంపిక సమయంలో ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడ వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. 2021లో పోస్టింగ్ ఇచ్చిన వారిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. 2023లో అప్పటి ప్రభుత్వం. హెచ్‌ఆర్‌ఎ, డిఎలు వీరికి వర్తింపజేయలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే చాలీచాలని వేతనంతో దూరప్రాంతాలకు వెళ్లి పనిచేసేందుకు వీరంతా ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వారి సొంత మండలాలకు దగ్గర్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చేలా జీవోను గత ప్రభుత్వం విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ (ఏపీటిటిఏ) కింద రెగ్యులర్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించారు. ఈ బదిలీల్లో ఎంటిఎస్‌లు పని చేస్తున్న పోస్టును ఖాళీగా చూపి అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయున్ని నియమించారు. అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుడు చేరడంతో ఎంటిఎస్ కింద చేరిన వారు మళ్లీ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఎంటిఎస్‌లో బదిలీలు నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ఎంటిఎస్ ఉపాధ్యాయులకు షరాఘాతంగా మారింది. తక్కువ వేతనం, డిఎలు, హెచ్‌ఎఆర్‌లు లేవు. పైగా ఈ విధానంలో పని చేస్తున్న అందరూ 45 నుంచి 50 ఏళ్లు పైబడిన వారే ఉన్నారు. రెండు, మూడు సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ చేసే వారూ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దూర ప్రాంతాల్లో విధుల్లో విధులు నిర్వహించేందుకు ఎంటిఎస్ ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి ఎంటిఎస్ ఉపాధ్యాయులను వారి మండల కేంద్రం సమీప కేంద్రాల్లోనే పోస్టింగ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తత్కాల్ టికెట్ల దందా..!

- గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో అక్రమాలు
- దళారులతో తత్కాల్ రిజర్వేషన్లు
- సాధారణ ప్రయాణికులకు అందని టికెట్లు



ప్రజాశక్తి-గుత్తి



గుత్తి రైల్వే స్టేషన్‌లో దళారుల తత్కాల్ రిజర్వేషన్ టికెట్ల దందా కొనసాగు తోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ టికెట్ల రిజర్వేషన్ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఏసీ తాత్కాల్, సాధారణ తాత్కల్ టికెట్ల బుకింగ్ కోసం వచ్చే ప్రయాణికుల నుంచి పలువురు దళారులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బుకింగ్ క్లర్కులు అక్రమాల అవతారం ఎత్తి పెద్ద ఎత్తున ప్రయాణికులను డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో ఈ తత్కాల్ దందా వ్యహారం చాలా ఎళ్లగానే జరుగుతోంది. స్థానికంగా ఉన్న దళారుల సాయంతో బుకింగ్ క్లర్కులు అక్రమాలకు పాల్పడుతున్నారు. గుత్తి నుంచి విజయవాడ, విశాఖపట్నం, ముంబై నగరాలకు అధిక సంఖ్యలో ప్రయాణికులు తాత్కాల్ రిజర్వేషన్ టికెట్లను బుక్ చేసుకుంటారు. స్థానిక రైల్వే షెడ్డు, ఇతర విభాగాల్లో బీహార్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన రైల్వే అధికారులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారందరూ స్వగ్రామాలకు వెళ్లేందుకు తత్కాల్ రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ కోసం కార్యాలయానికి వెళుతుంటారు. రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఒకరోజు ముందే రైల్వే ప్రయాణికులు తత్కాల్ రిజర్వేషన్ అప్లికేషన్ ఫామ్‌ను పూర్తి చేసి ఉంచుతారు. మరుసటి రోజు తత్కాల్ సమయానికి వెళ్లి క్యూలో నిల్చొని రిజర్వేషన్ చేసుకుంటారు. ఆ సమయంలో దళారుల వద్ద ఉన్న అప్లికేషన్లను ముందుగానే బుకింగ్ క్లర్కులకు అందజేస్తారు. దళారుల అందించిన దరఖాస్తులను ముందుగా తీసుకోవడంతో వారికే టికెట్లు వస్తున్నాయి. సాధారణ ప్రయాణికుల వంతు వచ్చే సరికి టికెట్లు లేవని బోర్డు పెట్టేస్తున్నారు. ఇలా ప్రతిరోజూ గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో 20 నుంచి 30 ఏసీ తత్కాల్, సాధారణ తత్కాల్ రిజర్వేషన్ టికెట్లు బుక్ అవుతాయి. అందులో దాదాపు 10 నుంచి 15 టికెట్లను క్లర్కులు అక్రమంగా బుకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టికెట్లు రిజర్వేషన్ చేస్తే ఒక్కో ప్యాసింజర్ నుంచి అదనంగా రూ.200 నుంచి రూ.300 తీసుకుంటున్నట్లు రైల్వే ప్రయాణికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అదనంగా వసూలు చేసిన సొమ్మును దళారులు, క్లర్కులు పంచుకుంటున్నారు.

కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ల తనిఖీలు..!?

గుంతకల్లులో విధులు నిర్వహించే కమర్షియల్ ఇన్స్‌పెక్టర్లు శనివారం గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో బుకింగ్ అయినా మూడు తత్కాల్ రిజర్వేషన్ టికెట్లను పరిశీలించారు. వాటికి క్లర్కు వద్ద ఉన్న నగదుకు తేడా ఉండడంతో ఆ టికెట్లను అధికారులు స్వాధీనం చేసుకుని వెళ్లినట్లు సమాచారం. ఆ ప్రయాణికులు విన్నపం మేరకు కమర్షియల్ అధికారులు గుంతకల్లు నుంచి డెమో రైలులో టికెట్లను తిరిగి గుత్తికి పంపారని తెలిసింది. ఇలాంటి తత్కాల్ టికెట్ల రిజర్వేషన్ అక్రమాలు గుత్తి రైల్వే స్టేషన్‌లో సర్వసాధారణం అని దీనిపై రైల్వే ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూస్తున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల మెరుపు ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన తర్వాతనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరుతూ అనంతపురం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సచివాలయం ఉద్యోగులు శనివారం ఉదయం మెరుపు ధర్నా నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కమిషనర్ కలిసి తమ డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కతంగా ఉన్న సమస్యలను పరిష్కరించిన తర్వాతనే బదిలీలు నిర్వహించాలని కోరారు. ముందుగా ఉద్యోగులకు ఇచ్చే రికార్డు అసిస్టెంట్ పేస్కేలు స్థానంలో జూనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. సీనియారిటీ, రాష్ట్ర జాబితా మేరకు ప్రమోషన్స్ కల్పించిన తర్వాతే బదిలీలు జరిగే విధంగా చూడాలని కోరారు. ఇంతకుముందే జారీ చేసిన జీవో నెంబర్ 523ను రద్దు పరచాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్ అందరికి మంజూరు చేయాలని కోరారు. మిగిలిన ఉద్యోగులు ఏ విధంగా సర్దుబాటు చేస్తారో తెలియజేయాలని అన్నారు. ఇవన్నీ ముగిసిన తర్వాతనే బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు.

దారి తప్పిన టిడిపి కూటమి పాలన

సిపిఎం ఆధ్వర్యంలో బుక్‌లెట్ విడుదల

ప్రజాశక్తి-యల్లనూరు



బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మొత్తం దారి తప్పిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో సిపిఎం రూపొందించిన 'కార్పొరేట్‌లకు వరాలు, పేదలకు శాపాలు.. దారి తప్పుతున్న కూటమి పాలన' బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అదే కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములు ఇస్తూ.. పేదోడికి ఇంటి స్థలం ఇచ్చేందుకు జీవో 30 అమలు చేయలేకపోతున్నారన్నారు. మరోవైపు నిరుద్యోగ భృతి రూ.3వేలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ రూ.20వేలు, పెట్టుబడి సాయం, మిర్చికి రూ.11,700 గిట్టుబాటు ధర, 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ఎక్కడా? అని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీల మోత మోగిస్తున్నారన్నారు. జిల్లాలో హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టలేదన్నారు. హంద్రీనీవా పిల్ల కాలువలు తవ్వకుండా లైనింగ్ పనులు చేస్తూ ఉస్తూ రైతులను నాశం చేస్తున్నారన్నారు. రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ పేరుతో లక్షల ఎకరాల భూమిని రైతుల నుండి చౌకగా అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారన్నారు. స్కీం, కాంట్రాక్ట్ వర్కర్లందరికీ కనీస వేతనం రూ.26వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. వీటితోపాటు అనేక హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, వీరయ్య, నాగయ్య, ఓబులేసు, అలివేలమ్మ, అసిత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకలికేకలు పట్టవా..?

మున్సిపల్ కార్యాలయం ముందు వంటావార్పు

ప్రజాశక్తి-గుంతకల్లు

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జెఎసి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలు శనివారానికి 45వరోజుకు చేరాయి. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ఆకలి కేకలు చేస్తూ మున్సిపల్ ఎదుట వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా అధ్యక్షులు టిజి సురేష్, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కన్వీనర్ సాయిపోగు సురేంద్ర, పట్టణ అధ్యక్షులు మల్లేష్, ఉపాధ్యక్షులు మస్తాన్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా అత్యవసర శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక హామీలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్షలకు సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు కె.నరసయ్య, పట్టణ అధ్యక్షుడు జగదీష్, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కర్నూలులో తోక కట్ చేస్తే ఇక్కడికొచ్చావ్..!


ఎమ్మెల్యే గుమ్మనూరుపై 'అనంత' ఫైర్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

కర్నూలు జిల్లాలో తోక కట్ చేస్తేనే ఇక్కడికి వచ్చి పడ్డాడనే విషయాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ గుర్తించుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మేము నీలాంటోళ్లను చాలామందినే చూశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి నుంచి ఎవరూ పోటీ చేయకూడదని,ఎ న్నికలకు ముందే సరెండర్ కావాలని, లేకపోతే తోలుతీస్తాం.. తాటతీస్తాం అని బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో జిల్లాకు వచ్చావ్... ఇక్కడి వాళ్లను తక్కువ అంచనా వేయద్దని సూచించారు. ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఓ సంస్థ సర్వే చేస్తే 53 మంది ఎమ్మెల్యేలు రెడ్‌జోన్‌లో ఉన్నట్లు తేలిందన్నారు. ఇందులో నువ్వు ఉన్నావనే విషయాన్ని మరవకూడదన్నారు. గుంతకల్లు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేదని, ఇప్పుడు వచ్చి అరాచకాలు సృష్టించొద్దన్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లో కుటుంబ సభ్యులను షాడో ఎమ్మెల్యేలుగా ఉంటూ ఇసుక నుంచి అన్నింట్లో దోపిడీ చేస్తున్నావని విమర్శించారు. ముఖ్యంగా గుంతకల్లులో పేకాట, మట్కా విచ్చలవిడిగా సాగుతోందని మండిపడ్డారు. కాగా రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేలకు జగన్ ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ సహా అందరూ తమకు ఇవే చివరి ఎన్నికలని భావిస్తున్నారన్నారు. ఏడాదిలోనే ప్రజల నాడి తెలిసిపోవడంతో అందరూ ఫ్రస్టేషన్‌లోకి వెళ్తున్నారన్నారు. టిడిపి నేతలకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థం అవుతోందని, ప్రజల నాడి తెలుసు కాబట్టే దౌర్జన్యాలు చేసి స్థానిక ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్వేచ్ఛ, సాధికారతకు ప్రతీక 'ఇంతియానం'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న రచయిత స్వర్ణకిలారి

ఆడవారి కళ్లతో ప్రపంచాన్ని చూపించే ప్రయత్నమే ఇంతియానం పుస్తకమని పుస్తక సంపాదకురాలు స్వర్ణ కిలారి అన్నారు. శనివారం సాయంత్రం అనంతపురంలోని ఎన్జీవో హోమ్‌లో సాహితీస్రవంతి, ఐద్వా సంయుక్తంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షత 'ఇంతియానం 2.0' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ కిలారి మాట్లాడుతూ 45 మంది మహిళల యాత్రా కథనాల సంకలనం ఇంతియానంను రెండు సంవత్సరాల క్రితమే ప్రచురించామన్నారు. ఆ పుస్తకానికి వచ్చిన ఆదరణ చూశాక మరో 55 మంది మహిళల యాత్రా కథనాలతో 'ఇంతియానం 2.0' ప్రచురించామని తెలిపారు. ఈ రెండు సంకలనాల్లోనూ అబ్బురపరిచే ఆలోచనా విధానం, వైవిధ్య యాత్రా నేపథ్యం, సాహసాలూ ఉన్నాయన్నారు. ఆధునిక మహిళ స్వేచ్ఛా, సాధికారతలకు ప్రతీక స్వర్ణ కిలారి సంపాదకత్వంలో వచ్చిన 'ఇంతియానం' మహిళల యాత్రాకథనాల సంకలనమని పుస్తకాన్ని పరిచయం చేసిన మానవహక్కుల వేదిక నాయకులు ఎ.చంద్రశేఖర్ అన్నారు. ఇంతియానం తెలుగులో తొలి మహిళా యాత్రా కథనాల సంకలనమని, ఒక్కో కథనం ఒక్కో ప్రదేశాన్నే కాదు, ఒక్కో స్త్రీ అంతరంగాన్ని, జీవన తాత్వికతనూ కళ్లముందు నిలుపుతుందని సంపాదకురాలిని, వ్యాసకర్తలను అభినందించారు. ఔత్సాహిక యాత్రికులు, ప్రభుత్వ మహిళా కళాశాల లెక్చరర్ మేరీమాధురి, ఆంగ్ల దినపత్రిక ద హిందూ పూర్వ కరస్పాండెంట్ రమేష్ సుసర్ల, సంగీతవాణి నిర్వాహకులు అడవాల శేషగిరి రాయుడు తమయాత్రల అనుభవాలను సభలో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటర్న్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, సాహితీస్రవంతి నాయకుడు సూర్యనారాయణరెడ్డి, ఐద్వా నాయకురాలు అశ్విని, ప్రసూన, రచయితలు శశికళ, తరిమెల అమర్నాథరెడ్డి, జూటూరు షరీఫ్, ఏలూరి యంగన్న, సత్యబోస్, గోవిందరాజులు, బిజిలీ, రాధేయ, రియాజుద్దీన్, రాజ్‌మోహన్, అధ్యాపకులు శివచంద్ర, పల్లవి, యుటిఎఫ్ నాయకులు కోటేశ్వరప్ప, రమణయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ముందుకు 'సాగు'య్యేనా..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంత వీక్షణం

ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఒకవైపు వర్షాలు సానుకూలంగా పడుతున్నాయి. ప్రధాన జలాశయాలకు నీరు వచ్చి చేరుతోంది. అయితే ఆ నీటిని సకాలంలో తీసుకునే అవకాశముందా లేదా అన్నది మాత్రం సందేహంగానే ఉంది. అనంతపురం జిల్లాకు ప్రధాన జలవనరుగానున్నది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ డ్యామ్‌లో గతేడాది 19వ గేటు కొట్టుకుపోయింది. దాని ఏర్పాటు ఈ ఏడాది ప్రారంభమైనా పూర్తవలేదు. ఇప్పుడు తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతున్నాయి. ఇప్పటికే డ్యామ్‌లో 40 టిఎంసీల వరకు నీళ్లు చేరాయి. ఇక్కడి నుంచి కాలువలకు నీటిని తీసుకునేందుకు వీలుంటుంది. కాని గేటు కాలువల ద్వారా తీసుకోవాలంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువలో జరుగుతున్న మరమ్మతు పనులు మధ్యలోనే ఆగాయి. ఇవి పూర్తయకుండా నీటిని తీసుకునేందుకు అవకాశం లేదు. ఇంకో వైపు డ్యామ్ భద్రత రీత్యా ఈసారి పూర్తి స్థాయిలో నీటి నిలువను డ్యామ్‌లో ఉంచేందుకు వీల్లేకుండా ఉంది. 80 టిఎంసీల వరకే నీళ్లు తీసుకునేందుకు అవకాశముంది. పూర్తి సామర్థ్యం వంద టిఎంసీయితే.. మొత్తం నిలువ ఉంచితే డ్యామ్ భద్రతకు ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. నిలువ తగ్గడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ నీళ్లు ముందు నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. కాని తీసుకునేందుకు ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులు పూర్తవలేదు. ఆలస్యంగా నీటిని తీసుకోవాల్సి వస్తుంది. దీని వల్ల జిల్లాకు నీటిని తీసుకోవడం తక్కువ అయితే ఆ ప్రభావం సాగు,తాగునీటిపై పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక హంద్రీనీవా పరిస్థితి అదే రకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచుతూ కాలువ వెడల్పు పనులు నడుస్తున్నాయి. జూన్ 30వ తేదీలోపు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనలో అధికారులు తెలిపారు. కాని ఆచరణలో పనులు అంత వేగంగా నడవటం లేదు. వచ్చే నెల వరకు కూడా కొనసాగే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఈ పనుల నడుమ నీటి విడుదలలోనూ జాప్యం జరిగే సూచనలే కనిపిస్తుండటం గమనార్హం.

ఈ వారంతా అధికారులు అన్ని కార్యక్రమాలను యోగాంధ్ర చుట్టూ నడిపారు. ప్రతి రోజూ ఏదోకచోట యోగాసనాలను వేసే కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నాడు అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. చివరికి ఉపాధి హామీ నరేగలో వ్యవసాయ కూలీలతోను యోగాసనాలు వేయించారు. ఉదయం లేస్తే కడుపు నింపుకోవడం కోసం ఆరుగాలం కష్టపడే వ్యవసాయ కూలీలతో యోగాసానాలు ప్రచారం ఏమిటన్న విమర్శలు వినిపించాయి.

రాజకీయంగా గుంతకల్లు ఎమ్మెల్యే వ్యాఖ్యలు దుమారమే రేపుతున్నాయి. తమ పార్టీలో చేరాలంటూ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శలకు దిగారు. ఆయన తీరు సరైంది కాదని మండిపడుతున్నారు. రామగిరి మండలంలో జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన పరామర్శ కార్యక్రమంలో నెలకొన్న హెలీకాప్టర్ కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. విచారణకు హాజరుకావాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రామగిరి పోలీసులు మరోమారు నోటీసులిచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరవలేదు. ఇప్పటికే పైలెట్, కో పైలెట్‌లను విచారించిన పోలీసులు, మరోమారు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని విచారించేందుకు పిలిచారు. ఈ విచారణ ఎప్పటికి పూర్తయి నివేదికను తయారు చేస్తారో చూడాల్సి ఉంది.

'తాటాకు చప్పుళ్ల'కు ఎవ్వరూ భయపడరు

ఎమ్మెల్యే జయరామ్‌పై మాజీ ఎమ్మెల్యే వైవిఆర్ ఫైర్

ప్రజాశక్తి-గుంతకల్లు

'గుమ్మనూరు జయరామ్.. వైసిపి బలమేంటో నీకు బాగా తెలుసు.. నీ తాటాకు చప్పుళ్లకు వైసిపి కార్యకర్తలు భయపడరు' అంటూ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం ఓ వీడియో ద్వారా స్పందిస్తూ సోషల్ మీడియాలో విడుదల చేశారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గాలికి కొట్టుకొచ్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ వైసీపీని భయపెట్టాలని చూస్తే భయపడేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి నాయకులు నామినేషన్ వేయకుండా ఎలా అడ్డుకుంటావో చూస్తామన్నారు. జగన్ భిక్షతో మంత్రిగా పని చేసిన నీ చరిత్ర గురించి తనకు పూర్తిస్థాయిలో తెలుసన్నారు. రానున్న ఎన్నికల్లో మీ నాయకులు పోటీకి సిద్ధంగా ఉన్నారో.. లేదో.. చూసుకోవాలన్నారు. తన 65ఏళ్ల జీవితంలో దౌర్జన్యాలు, రౌడీయిజాలు చాలా చూశానన్నారు. ఏడాది పాలనలో నీ ప్రవర్తన చూసి మీ పార్టీ నాయకులే విసిగిపోయారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతానని మాట్లాడుతున్నావ్.. ప్రజాస్వామ్యంలో అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే అమలవుతుందనే విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఇవిఎంల మాయ, మోసపూరిత హామీల వల్ల గెలిచి బయటపడ్డావేగానీ.. దమ్ము, ధైర్యం ఉంటే ఇప్పుడు రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పని చేయాలని హితువుపలికారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ వాటర్‌వర్క్స్‌లో పని చేస్తూ మృతిచెందిన అవుట్‌సోర్సింగ్ కార్మికుడు నారాయణ కుటుంబానికి కార్మికులు చెందాలు వేసుకున్న రూ.1.25లక్షల మొత్తాన్ని శనివారం కమిషనర్ బాలస్వామితో కలిసి అందజేశారు. కార్మికులు అంతరూ తమ ఒక్కరోజు వేతనంతో కూడిన రూ.1,20,500ను అందించారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

అనంతపురం సిటీ : స్థానిక మహతి సంగీత పాఠశాలలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గొప్పగొప్ప సంగీత విధ్వాంసులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహతి సంగీత పాఠశాల అధినేత మహీధర్ సభ్య గాయకులందరికీ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ స్కూల్ శ్రీనివాసులు, శివరంగయ్య, లంకా ప్రసాద్, టీచర్ శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రమారెడ్డి, మాధవి, జాన్సీలక్ష్మి, ఆశా, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

98 మంది ఉద్యోగాలకు ఎంపిక

శింగనమల : బుక్కరాసముద్రం మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి)లో నిర్వహించిన జాబ్‌మేళాలో 98 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ సాంబశివారెడ్డి తెలిపారు. వీరందరూ రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రంజిత్‌రెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా ఆర్.మంజుల



గుంతకల్లు : మండల సర్వేయర్‌గా ఆర్.మంజుల శనివారం బాధ్యతలు చేపట్టారు. వజ్రకరూరు మండల సర్వేయర్‌గా పని చేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా గుంతకల్లుకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు మండలంలోని ప్రజలు, రైతుల భూమి సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు.

విఆర్‌ఎ, విఆర్‌ఒలకు సన్మానం

శింగనమల : జిల్లాకేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో మండలంలోని సోదనపల్లికి చెందిన విఆర్‌ఎ వెంకటేష్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో విఆర్‌ఎల విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలు, ప్రభుత్వానికి వారిధిగా నిలుస్తారన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు రెవెన్యూ పరిధిలో విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఒ కురువ రామన్నను మాజీ సర్పంచు కేశప్ప ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, మాజీ ఎంపిటిసి ఆనంద, గ్రామ కమిటీ సభ్యులు బాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కురుగౌడ, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ శివకుమార్, మాజీ మార్కెట్ డైరెక్టర్ నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివలింగప్ప, చంద్రన్న, ఐ టిడిపి ఛాంపియన్ బజ్జన్నగౌడ్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి రవీంద్ర, నాయీబ్రాహ్మణ అధ్యక్షులు నరసింహులు, నాగరాజు, చంద్రన్న, స్కూల్ కమిటీ సభ్యులు అనితమ్మ, మమతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు ఎపిఒగా తులసీప్రసాద్



పుట్లూరు : పుట్లూరు ఎపిఒగా తులసీప్రసాద్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎపిఒగా ఉన్న నరేంద్రను కూడేరు ఎపిఒగా బదిలీ చేశారు. దీంతో కూడేరు ఎపిఒగా విధులు నిర్వహిస్తున్న తులసీప్రసాద్‌ను ఇక్కడికి నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

23న దుకాణాలకు వేలంపాట

రాయదుర్గం : పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఆవరణలో ఖాళీగా ఉన్న ఆరు దుకాణాలకు గుడ్‌విల్ పద్ధతిన ఈనెల 23వతేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు రూ.3 లక్షలు విలువజేసే సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.2లక్షల గుడ్‌విల్ (తిరిగి చెల్లించబడని) చెల్లించి పాల్గొనవచ్చని కోరారు.

శెట్టూరు తహశీల్దార్‌గా ఈశ్వరమ్మ



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న ఈశ్వరమ్మ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో ఎఒగా పని చేసిన ఈశ్వరమ్మ శెట్టూరు మండల తహశీల్దార్‌గా నియమితులయ్యారు. దీంతో ఆమె ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు లేకుండా చూడాలని కోరారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

అనంతపురం : తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఈనెల 23వతేదీ సోమవారం నిర్వహించనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బండి కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో వైసిపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొననున్నట్లు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

గుత్తి : ప్రయాణికులు మరిచిపోయిన బ్యాగును వారికి అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. వివరాలోకి వెళ్తే.. కూడేరు మండలం కదరకుంట గ్రామానికి చెందిన నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి గుత్తిలోని బైబిల్ మిషన్ (స్వస్థతశాల) వెళ్లేందుకు ఆటో ఎక్కారు. స్వస్థతశాలకు ఆటో వెళ్లింది. అక్కడ ప్రయాణికులు ఒక బ్యాగును మరిచి దిగి వెళ్లిపోయారు. అక్కడి నుంచి వచ్చిన ఆటో డ్రైవర్ షేక్ నజీర్ గంట తర్వాత ఆటో వెనుక వైపున చూడగా ఓ బ్యాగు అక్కడే ఉంది. దీంతో బ్యాగును తెరిచి చూడగా అందులో కొంత నగదు, మొబైల్, విలువైన వస్తువులు ఉన్నాయి. తక్షణమే ఆ సెల్ ఫోను కాల్ లిస్టులో ఉన్న నంబర్‌కి ఫోన్ చేశాడు. స్వస్థతశాలలో ఉన్న నాగరాజును బయటికి పిలిపించి ఆటో డ్రైవర్ల సమక్షంలో బ్యాగును అతనికి అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ షేక్ నజీర్ ను పలువురు అభినందించారు.

వైసిపి నాయకుడు లాలునాయక్‌కు సన్మానం

గుత్తి : మండలంలోని బసినేపల్లి తండా గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు లాలునాయక్‌ను శనివారం ఆ పార్టీ నాయకులు సన్మానం చేశారు. లాలునాయక్ వైసిపి ఎస్టి విభాగ మండల అధ్యక్షుడుగా నియమితులయ్యారు. దీంతో వైసిపి నాయకులు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పంచాయతీ విభాగ రాష్ట్ర కార్యదర్శి సివి రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గురుప్రసాద్ యాదవ్, కౌన్సిలర్ వి.వరదరాజులు, నాయకులు బి.రమేష్‌రెడ్డి, మున్నా, అబ్దుల్‌రవూఫ్, ఎస్సీ సెల్ కన్వీనర్ మల్లికార్జున, అబ్దుల్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో విజయకేతనం ఎగరవేస్తాం : వైసిపి

ప్రజాశక్తి-గుత్తి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అన్నిస్థానాల్లో పోటీ చేసి విజయకేతనం ఎగరవేస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్ ఒడ్డి, జి.గంగరాజుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి ఎన్.ప్రవీణ్‌కుమార్ యాదవ్, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు పోటీ చేయకుండా చూస్తానని నామినేషన్లు వేస్తే కోసి సున్నం పెడతానని, రెడ్‌బుక్ ఓపెన్ చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎమ్మెల్యే ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మైనుద్దీన్, సివి.రంగారెడ్డి, బి.గురుప్రసాద్ యాదవ్, ఫయాజ్, బి.రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివరామ్, వరదరాజులు,కెవి రమణ,నరేష్, సర్పంచిలు, కె.రమేష్‌నాయుడు, చిన్న ఆంజనేయులు, ఎం.చంద్ర, ఎంపీటీసీ చిన్న ఈరన్నగౌడ్, నాయకులు మున్నా రఘునాథ్‌రెడ్డి, రాజన్న, ఎస్.రాముయాదవ్, జీపు రమణ, గోపీరెడ్డి, మహాలింగ, లాలూనాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

పరిశోధనలకు ఐఒటి తోడ్పాటు

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

పరిశోధనలకు ఐఒటి (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) తోడ్పాటు అందిస్తున్నని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. శనివారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఒటి ల్యాబ్‌ను విసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఒటి అప్లికేషన్స్‌ను ప్రతి ఒక్కరూ, ప్రతిరోజూ, ప్రతిచోటా వాడుతున్నామని తెలిపారు. అంతేగాకుండా జీవితాన్ని సౌర్యవంతంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎం.టెక్, బి.టెక్ విద్యార్థులు ఐఒటి (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) ఉపయోగించుకుని ప్రాజెక్టులు చేయాలన్నారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు తాము చదువుతున్న సబ్జెక్టులపై ప్రాక్టికల్ అవగాహన పెంచుకోవడమే కాకుండా పరిశోధనల కోసం కూడా ఉపయోగించుకునే అవకాశం లభించనుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఇసిఇ విభాగం విభాగం అధిపతి జి.మమత, అల్యూమిని సభ్యులు జానకిరామ్, పి.శాంతిసాగర్, ఎన్.హర్ష, వి.శంకర్, ఇసిఇ విభాగం అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

ప్రజాశక్తి-నార్పల

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని ఎంపిడిఒ మమతాదేవి, ఇఒఆర్‌డి శైలజారాణి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బండ్లపల్లిలో ఎంపిడిఒ, మండల కేంద్రంలో ఇఒఆర్‌డిఒ శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలోని ఆహార పదార్థాలు తినకూడదన్నారు. అనంతరం బట్టలతో తయారు చేసిన బ్యాగులను వినియోగదారులకు పంపిణీ చేశారు. బండ్లపల్లిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటితొట్టిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపాధి హామీ ఎపిఒలు రమేష్ రామారావు, ఎర్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, పరశురాం, చరణ్, శ్రీనివాస్, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, లక్ష్మీదేవి, వరలక్ష్మి, రాజేశ్వరి, కీర్తన, కుల్లాయప్ప, చిన్న రాయుడు, మాధవి, మల్లికార్జున, చంద్ర, శిరీషా, ఆదినారాయణ, కుళ్లాయిస్వామి, సచివాలయల సిబ్బంది, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడిగా వీరకుమార్‌రెడ్డి



అనంతపురం సిటీ : అనంతపురం ఔషధ నియంత్రణ శాఖ ఎడిగా వీరకుమార్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇదేక్రమంలో అనంతపురం డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌గా మాధవి బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఎడిగా పని చేస్తున్న రమేష్‌రెడ్డి నెల్లూరుకు డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన హనుమన్న నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు ఎడిగా పని చేస్తున్న వీరకుమార్‌రెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు.

'గుమ్మనూరు' వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఉరవకొండ : వైసీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తూ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతియుతంగా ఉన్న నియోజకవర్గంలో దౌర్జన్యాలు, బెదిరింపులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోమారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాదని రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామని సమావేశంలో చెప్పడం నేరమన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ హింసా రాజకీయాలను ప్రేరేపిస్తూ మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

అనంతపురం సిటీ : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి దేవి సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరూ మీరు నివసించే ప్రాంతాలు, పని చేసే ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, ప్రోగ్రాం అధికారులు యుగంధర్, అధికారులు నరేంద్రరెడ్డి, హెచ్ఇఒ నాగరాజు, డెమో త్యాగరాజ్, గంగాధర్, పిఎంఒ నాగన్న, విజయ భాస్కర్‌రెడ్డి, పవన్, సురేష్, శ్రీనివాసులు, ఎన్‌హెచ్ఎం కిషోర్‌కుమార్, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను ఖాతాల్లోకి జమచేయాలి



మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నేతలు

ఉరవకొండ : కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులను వెంటనే రైతుల ఖతాలకు జమ చేయాలని కౌలు రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశులు అన్నారు. శనివారం ఉరవకొండలో కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈనెల 21వతేదీన రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఖాతాలోకి జమ చేస్తామని చెప్పారన్నారు. అయితే అమలు చేయకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వివిధ రకాల పంటల సాగు చేయడానికి సమాయాత్తం అవుతున్నారన్నారు. కావున వెంటనే రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు తిప్పయ్య, సుంకన్న, ఆంజనేయులు, ఓబులేసు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి

గుంతకల్లు రూరల్ : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక కసాపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల క్రమశిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపకూడదన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు, దించేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కకు వెళ్లి ఆపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దన్నారు. అలాగే కసాపురంలో లాడ్జిలు ఓనర్లతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కసాపురం ఎస్ఐ వెంకట్‌స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘాల బలోపేతంతోనే దళారీ వ్యవస్థ నిర్మూలన

కళ్యాణదుర్గం టౌన్ : రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల బలోపేతంతోనే దళారీ వ్యవస్థను నిర్మూలించవచ్చని ఎఫ్ సిబిఒ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాస్కర్‌బాబు, ఎటిఎల్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.వెంకటంపల్లి కోల్డ్ స్టోరేజ్ గ్రామంలో మహిళా రైతు లింగమ్మ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సహాయ సహకార సభ్యుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను రూపుమాపితేనే పంటకు గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. రైతు అంగళ్ల ద్వారా నాణ్యమైన వ్యవసాయ పనిముట్లు, నిత్యావసర సరుకులు, విత్తనాలు అందుబాటులోని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఉత్పత్తిదార సంఘాలు లాభాల బాటలో పయనించాలంటే రైతు సంఘాల సభ్యుల సమిష్టి కృషితోనే సాధ్యమన్నారు. అనంతరం ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి వీడియో రూపంలో ప్రసంగాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఇఒ మేనేజర్ రమేష్, అకౌంట్స్ మేనేజర్ కళ్యాణకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-శింగనమల




వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న 12 వారాల బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కర్, ఇన్‌ఛార్జి ఎపిఒ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఉపాధి హామీ చట్టం వరం అన్నారు. కూలీలకు దాదాపు 12 వారాలు బిల్లులు చెల్లించకుంటే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. అలాగే సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 కూలి ఇవ్వాలలన్నారు. పని చేసే చోట కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు సుంకన్న, సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, కొండారెడ్డి శ్రీనివాసులు, ధనాంజనేయులు, ఆంజనేయులు, వెంకటస్వామి, జయరాముడు, కుళ్లాయిస్వామి, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి చెరువులో అరుదైన చేప లభ్యం

ప్రజాశక్తి-గుత్తి



అరుదైన చేప

మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో శనివారం అరుదైన చేప లభ్యమైంది. గ్రామంలోని చెరువులో కొందరు చేపల వేటకు వెళ్లారు. వలలో చేపలు చిక్కడంతో మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు. చేపలను తీసిచూడగా సుమారు పది కిలోలు ఉన్న అరుదైన చేప కనిపించింది. ఏదో అరుదైన చేప చిక్కిందని ఇక తమ పంట పండిందని మత్స్యకారులు భావించారు. అయితే కొందరు ఇది దెయ్యం చేప అని.. వాటిని తింటే అనారోగ్యాల పాలవుతారని చెప్పారు. కాగా ఇలాంటి చేపలు ఎక్కువగా కోస్తా, కోనసీమ జిల్లాల్లోని చేపల చెరువుల్లోకి చేరి ఇతర చేపల అభివద్ధికి ఆటంకం కలిగిస్తాయని తెలిసింది. ఈ చేపలు సముద్ర జలాల్లో మాత్రమే తిరుగుతాయని, భారీ వర్షాల సమయంలో నదుల ద్వారా చెరువుల్లోకి చేరుతాయని మత్స్యకారులు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకున్న స్థానిక మత్స్యకారులు చేపను చంపి చెరువు సమీపంలో పూడ్చిపెట్టారు.

గుండె సమస్యకు ఆల్కహాల్‌తో చికిత్స..!

ఎఎస్ఎ చికిత్సతో నయం చేసిన డాక్టర్ ప్రదీప్‌కృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్‌కృష్ణ

ఆయాసం, గుండెదడ, ఛాతీలో నొప్పి, కళ్లు తిరగడం లాంటి మామూలు లక్షణాలతో వచ్చిన ఒక రైతుకు.. అసాధారణం, అత్యంత అరుదైన సమస్య ఉందని గుర్తించిన అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు.. శస్త్రచికిత్స అవసరం లేకుండా నయం చేసి పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను చికిత్స అందించిన కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.ప్రదీప్‌కృష్ణ తెలిపారు.

తాడిపత్రి ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల రైతు తరచు ఆయాసం, గుండె దడ, ఛాతీలో నొప్పి, కళ్లు తిరగడం లాంటి సమస్యలతో బాధపడుతూ వచ్చారు. ఆయనకు తగిన పరీక్షలు చేస్తే అత్యంత అరుదైన హైపర్‌ట్రోఫిక్ అబ్‌స్ట్రక్టివ్ కార్డియోమయోపతి (హెచ్ఓసీఎం) అనే వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇది ప్రతి వెయ్యిమందిలో ఇద్దరికి మాత్రమే కనిపిస్తుంది. దీనికి ముందుగా కొన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో ఆయన గుండె విఫలమయ్యే పరిస్థితి కూడా ఏర్పడింది. దీంతో ఆయనకు ఆల్కహాల్ సెప్టల్ అబ్లేషన్ (ఎఎస్ఎ) అనే చికిత్స చేయాలని నిర్ణయించుకుని చికిత్స చేసినట్లు తెలిపారు.

'యువతపోరు'ను విజయవంతం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 23వతేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి యువజన విభాగం ఎంతో కీలకమన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యువతపోరు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు దాదాఖలందర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా, యువజన విభాగం నాయకులు మైను, సోహైల్, సాయికృష్ణ, బాలిరెడ్డి, కుమార్, జగదీష్, వేణు, బాబా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక వైసిపి కార్యాలయంలో ఈనెల 23న నిర్వహించనున్న యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గోళ్ల సూరి, తాలూకా యూత్ కన్వీనర్ చరణ్, రాష్ట్ర సెక్రటరీ రామాంజనేయులు, జిల్లా సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మల్లాపురం మల్లి, మున్సిపాలిటీ అధ్యక్షులు దొడగట్ట మురళి, మైనార్టీ నాయకులు జాకీర్, మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యులు షేక్షావలి, గోపారం శ్రీనివాసులు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి



మృతిచెందిన రాజేశ్వరి

పామిడి : మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చి వద్ద నివాసం ఉండే రాజేశ్వరి (27) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వివరాల్లో వెళ్తే.. రాజేశ్వరి పామిడికి చెందిన ఓ వ్యక్తితో మాట్లాడేందుకు వంకరాజుకాలువ గ్రామానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ ఇద్దరూ గొడవ పడినట్లు సమాచారం. ఈ గొడవలో రాజేశ్వరి తలకు దెబ్బ తగిలి కింద పడినట్లు తెలుస్తోంది. వెంటనే ఆ వ్యక్తి ఆమెను అక్కడే వదిలేసి వెళ్లాడు. గమనించిన స్థానికులు పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా రాజేశ్వరి భర్త ఈశ్వర్‌రెడ్డి కువైట్ వెళ్లాడు. ఈ మధ్యకాలంలోనే కువైట్ నుంచి వచ్చిన ఆయన శుక్రవారం తిరిగి కువైట్‌కు వెళ్లాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.